# చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

**శెనార్తి మీడియా, మానకొండూరు/ శంకరపట్నం:**




చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేపట్టిన 'మిషన్ 10వ తరగతి' కార్యక్రమ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతులు గొప్ప ప్రోత్సాహాన్నిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొత్తం రూ. 2.2 కోట్ల నగదు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానానికి రూ. 5 లక్షలు, ద్వితీయ స్థానానికి రూ. 3 లక్షలు, ప్రతి జిల్లా టాపర్‌కు రూ. 2 లక్షలు, 119 అసెంబ్లీ నియోజకవర్గాల టాపర్లకు తలా రూ. లక్ష, 612 మండలాల టాపర్లకు తలా రూ. 10 వేల చొప్పున బహుమతులు ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సురేఖ, ఎంపీడీఓ కృష్ణ ప్రసాద్, సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, బసవయ్య గౌడ్, గట్టు తిరుపతి, ఉప్పుగళ్ల మల్లారెడ్డి, నాంపల్లి తిరుపతి, అర్థం కుమార్, గండికోట రవి తదితరులు పాల్గొన్నారు.

## యూరియా లేక రైతులు అవస్థలు : సీపీఐ



**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

మండలంలో రైతులకు సరిపడే యూరియా లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని సీపీఐ నాయకులు అన్నారు. సోమవారం గన్నేరువరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా యూరియా బుకింగ్ చేయాలని అధికారులు సూచిస్తున్నారని, చదువు లేని రైతులు ఎలా బుకింగ్ చేసుకుంటారని ప్రశ్నించారు. ప్రతి గ్రామంలో యూరియా కొరత ఉందని, సరఫరా ఎప్పుడు వస్తుందోనని రైతులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. బెల్ట్ షాపుల వద్ద లిక్కర్‌కు కొరత లేకపోగా యూరియా మాత్రం దొరకకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు సరిపడే యూరియా తెప్పించాలని, లేనిపక్షంలో మండల వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, మండలం సహాయ కార్యదర్శి కూన మల్లయ్య, గ్రామ కార్యదర్శి బోయిని మల్లయ్య, గ్రామ సహాయ కార్యదర్శి బొమ్మకంటి అంజయ్య చారి, నాయకులు ఎండీ నాయ్యిమ్, నృత కొమురయ్య, బూట్ల భాస్కర్, రాపోలు రాయమల్లు, కళ్లెం రవి పాల్గొన్నారు

## తెలంగాణను క్రీడా హబ్‌గా మార్చడమే లక్ష్యం



- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

తెలంగాణను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ సంకల్పమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శంకరపట్నం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి, సీఎం కప్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో, ముఖ్యంగా ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు ఆశించిన స్థాయిలో పతకాలు సాధించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లోటును భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి ఉత్తమ క్రీడాకారులను దేశానికి అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇప్పటికే స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిందన్నారు. నూతన క్రీడా విధానంలో భాగంగా విద్యార్థి దశ నుంచే ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు సీఎం కప్ వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి , ఎంపీడీఓ కృష్ణ ప్రసాద్, తహసీల్దార్ సురేఖా, ఎస్ఐ శేఖర్ రెడ్డి, నాయకులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, గోపగోని బసవయ్య గౌడ్, నాంపెల్లి తిరుపతి, గట్టు తిరుపతి, ఉప్పుగళ్ల మల్లారెడ్డి, గొట్టే మధు, రాయని రమేష్ తదితరులు పాల్గొన్నారు

## బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

- తుమ్మనపల్లి సమీపంలో ప్రమాదం
- సమయానికి స్పందించిన 108 సిబ్బంది



**శెనార్తి మీడియా, హుజురాబాద్ / శంకరపట్నం :** హుజురాబాద్ మండలంలోని తుమ్మనపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సింగాపూర్ గ్రామానికి చెందిన పాకాల మధుకర్ రెడ్డి (40) తన వ్యక్తిగత పనుల నిమిత్తం సింగాపూర్ నుండి తుమ్మనపల్లికి వెళ్లి వస్తుండగా, తుమ్మనపల్లి హనుమాన్ దేవాలయం వద్ద మోటార్ సైకిల్ అదుపుతప్పింది. వేగంగా వెళ్తున్న బైక్ అక్కడి బ్రిడ్జిని బలంగా ఢీకొనడంతో మధుకర్ రెడ్డి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే పడిపోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే 108 సిబ్బంది ఈఎంటి గూడూరి సతీష్ రెడ్డి, పైలెట్ కాజా ఖలీల్ ఉల్లా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రక్తస్రావం అవుతున్న క్షతగాత్రునికి అంబులెన్స్‌లోనే ప్రథమ చికిత్స అందిస్తూ మెరుగైన వైద్యం కోసం హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించి ఆసుపత్రికి చేర్చిన 108 సిబ్బందిని స్థానికులు అభినందించారు.

## మూడు వ్యవసాయ మోటార్ల చోరీ

- అంబాలపూర్, ఇప్పలపల్లి, పోలంపల్లి గ్రామాల్లో దొంగతనం
- అనుమానితుల సమాచారం ఉంటే తెలపాలని ఎస్ఐ విజ్ఞప్తి

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

మండలంలోని వివిధ గ్రామాల్లో గుర్తు తెలియని దొంగలు రైతుల విద్యుత్ మోటార్లను ఎత్తుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పలపల్లికి చెందిన చింతిరెడ్డి కరుణాకర్ రెడ్డి, పోలంపల్లికి చెందిన పడాల సారయ్య, అంబాలపూరు గ్రామానికి చెందిన గుజ్జుల రమణా రెడ్డికి చెందిన మూడు కరెంటు మోటార్లను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. సోమవారం ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు మోటార్లు మాయమైనట్లు గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు. ఈ దొంగతనాలకు సంబంధించి ఎవరికైనా సమాచారం తెలిసినా లేదా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో గానీ లేదా డయల్ 100 ద్వారా గానీ సమాచారం అందించాలని ఆయన ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు

## జాతీయ రహదారి నిర్మాణంతో
# కొత్తగట్టులో తిప్పలు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

జాతీయ రహదారి నిర్మాణ పనుల కారణంగా కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానిక నాయకులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగట్టు గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాడ సుజాత రాజిరెడ్డి, ఉప సర్పంచ్ వెంగళ విజేందర్ రెడ్డి మాట్లాడుతూ రహదారి నిర్మాణం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. ముఖ్యంగా రహదారి ఎత్తు పెరగడంతో గ్రామ పంచాయతీ కార్యాలయం లోతట్టుకు వెళ్లిపోయిందని, దీనివల్ల ప్రజలకు కార్యాలయం ఎక్కడ ఉందో కూడా తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా స్మశానవాటికకు వెళ్లే దారి లేకపోవడం, గ్రామంలోకి ప్రవేశించేందుకు సరైన యూ–టర్న్ సౌకర్యం కల్పించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇది ప్రమాదాలకు దారితీస్తోందని పేర్కొన్నారు. పాఠశాల నుంచి గ్రామ పంచాయతీ వరకు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి మురుగు నీరు నిలిచిపోతోందని మండిపడ్డారు. ఎన్‌హెచ్–456 అధికారులు తక్షణమే స్పందించి యూ–టర్న్, డ్రైనేజీ మరియు గ్రామ ప్రవేశ మార్గం వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య, వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌తో ఆదిలాబాద్‌కు
# తీవ్ర అన్యాయం : కాంగ్రెస్



**శెనార్తి మీడియా, బోథ్:**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి విమర్శించారు. బోథ్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విమానాశ్రయం, యూనివర్సిటీ, ఆర్మూర్–ఆదిలాబాద్ రైల్వే లైన్, ఇండస్ట్రియల్ కారిడార్ నిధులు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి, సీసీఐ పునరుద్ధరణ వంటి కీలక అంశాలు బడ్జెట్‌లో చోటు దక్కకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంలో జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. తెలంగాణకు కూడా ఈ బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోలేదని పేర్కొన్నారు. వ్యవసాయం, ఉపాధి రంగాలకు నిధులు తగ్గించారని, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలు లేవని విమర్శించారు. ఎరువుల ముడి సరుకుల ధరల పెంపు రైతాంగాన్ని నష్టపరుస్తుందని, గృహ నిర్మాణానికి తగిన నిధులు కేటాయించకపోవడం బీజేపీ సంకుచిత ఆలోచనలకు నిదర్శనమన్నారు. కిసాన్ సమ్మాన్ నిధులు పెంచుతామని చెప్పి అమలు చేయకపోవడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా తెలంగాణ ఎంపీలు, ఎమ్మెల్యేలు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భోడ్డు గంగారెడ్డి, ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, మాజీ ఎంపీటీసీ చట్ల ఉమేష్, మార్కెట్ డైరెక్టర్ మహమ్మద్ అబ్రార్, ఆత్మా డైరెక్టర్ రహీముద్దీన్, ధన్నూర్ ఉప సర్పంచ్ కారం రవి, చమేందర్ రెడ్డి, మహమ్మద్, ఆత్రం సుశీల, ఆత్మా డైరెక్టర్ గడ్డల నారాయణ, అనిల్ అప్ప, మెరుగు నరసింహ దాసు మాజీ సర్పంచ్, ఇట్టేడి రాజు రెడ్డి, యూసుఫ్, గంగాధర్, యువ నాయకులు అచ్యుతానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు
## అన్ని సౌకర్యాలే లక్ష్యం: ఆడే గజేందర్



**శెనార్తి మీడియా, బోథ్:**

ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. బోథ్ మండలం దన్నూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణానికి స్థానిక సర్పంచ్ ఎల్మా రోహిణి వినయ్ రెడ్డితో కలిసి భూమి పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం విద్య రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగా రెడ్డి, బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, బోథ్ సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్, కుచ్లాపూర్ సర్పంచ్ మైలీ నారాయణ, దన్నూర్ ఉప సర్పంచ్ కారం సుజాత, కుచ్లాపూర్ ఉప సర్పంచ్ సుద్దాల అరుణ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉమేష్, దన్నూర్ మాజీ సర్పంచ్ ఆడెల్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఇంద్ర రెడ్డి, అబ్రార్, ఆత్మ డైరెక్టర్ రహిమొద్దీన్, గడ్డల నారాయణ, మాజీ సర్పంచ్ నరసింహ దాస్, జిల్లా అధికార ప్రతినిధి చంటి, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, ఎద్మేల రమణ రెడ్డి, సామల సంతోష్, ఆత్రం సుశీల, ఇట్టేడి రాజు రెడ్డి, మొహమ్మద్, యండి సద్దాం, శేమేందర్ రెడ్డి, దినేష్ రెడ్డి, శంషోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

**శెనార్తి మీడియా, ఎడపల్లి:**

ఎడపల్లి మండలం జానకంపేటలోని సుప్రసిద్ధ లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు భక్తుల సందడి మధ్య ఘనంగా ముగిశాయి. ఆలయ కమిటీ ఆధ్వ ర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టమి సందర్భంగా కోనేరులో చక్రస్నానం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కుస్తీ పోటీలు ఈసారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గెలుపొందిన కుస్తీ వీరులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో గింజుపల్లి వేణు మౌలిక వసతులు ఏర్పాటు చేయగా, శాంతి భద్రతల పరిరక్షణను ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తాళ్ల విజయ్ కుమార్ గౌడ్, రాధా కిషన్ గౌడ్, ఆకారం సాయిలు, ఉప్పు సురేష్, ఉప్పు సంతోష్, చేపూరి కిషోర్, ఇరేటి లింగం, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**శెనార్తి మీడియా, బోథ్:** సైబర్ నేరాల పట్ల ప్రజలు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆర్బీఐ కౌన్సిల ర్లు సూచించారు. బోథ్ మండలం కర త్వాడ గ్రామపంచాయతీ పరిధిలోని జీడి పల్లె గ్రామంలో ఆర్బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహనా సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ బ్యాంకుల పేరుతో ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగితే నమ్మవద్దని హెచ్చరించారు. ఏవైనా అనుమానాలు వచ్చినప్పుడు వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సుకన్య సమృద్ధి, అటల్ పెన్షన్ యోజన, ప్రధాన మంత్రి జనధన్ యోజన, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన వంటి పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుర్వ విశ్వేశ్వర్ రావు, ఆర్బీఐ కౌన్సిలర్లు ప్రసాద్, సంతోష్, ప్రధానోపాధ్యాయులు గంగయ్య, ఎఫ్‌ఏ మండడి రాము, గ్రామ పటేల్ దుర్వ గంగారాం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అటవీ సంపదలను కాపాడుకోవడం అత్యంత అవసరం



**శెనార్తి మీడియా, బోథ్:** చిట్టడి నేలల దినోత్సవం–2026 సందర్భంగా బోథ్ రేంజ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ మోడల్ స్కూల్, బోథ్ విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా చిట్టడి నేలల ప్రాముఖ్యత, జీవ వైవిధ్య సంరక్షణ, నీటి వనరుల సుస్థిర వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిట్టడి నేలలు పర్యావరణ సమతుల్యతకు, జీవుల సంరక్షణకు, మానవ జీవనానికి కీలకమని వివరించారు. విద్యార్థులు చిట్టడి నేలలు, నీటి సంరక్షణ, వలస పక్షులు, పర్యావరణ అంశాలపై తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టి. ప్రణయ్, అటవీ శాఖ సిబ్బంది, తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమం చివరగా చిట్టడి నేలల సంరక్షణకు కట్టుబడి ఉంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

# షుగర్ ఉందా..? అయితే బాదంపప్పును తినండి



## తరచు కడుపు నొప్పి ఏ వ్యాధుల లక్షణం?

కొంతమందికి తరచూ కడుపు నొప్పి వస్తూ ఉంటుంది. చాలా మంది దీనిని గ్యాస్, అలసట లేదా ఆహారంలో జాగ్రత్తలు పాటించకపోవడమేనని భావించి నిర్లక్ష్యం చేస్తారు. కానీ కడుపు నొప్పి మళ్లీ మళ్లీ వస్తుంటే.. అది శరీరంలో ఉన్న ఏదో ఒక అంతర్గత సమస్యకు సంకేతం కావచ్చు. ఈ విషయంపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

తరచూ వచ్చే కడుపు నొప్పి.. గుండెల్లో మంట, కడుపు బరువుగా అనిపించడం, వాంతులు, ఆకలి లేకపోవడం, విరేచనాలు లేదా మలబద్ధకం, కడుపు ఉబ్బరం, బలహీనత, అలసట వంటి ఇతర లక్షణాలతో కూడి ఉండొచ్చు. కొందరికి తలనొప్పి లేదా తల తిరగడం కూడా కనిపించవచ్చు. ఈ నొప్పి ఎక్కువసేపు కొనసాగితే లేదా రోజువారీ పనులకు ఆటంకం కలిగిస్తే దాన్ని తేలికగా తీసుకోవద్దు. శరీరం ఈ లక్షణాల ద్వారా ఏదో సమస్య ఉందని ముందుగానే హెచ్చరిస్తుంది.

### తరచూ కడుపు నొప్పి ఏ వ్యాధులకు లక్షణం?

- ఆరోగ్య నిపుణుల ప్రకారం తరచూ వచ్చే కడుపు నొప్పి కింది సమస్యలకు సంకేతంగా ఉండవచ్చు.
- ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్
- ఇన్ఫ్లమేటరీ బవెల్ డిసీజ్
- గ్యాస్ట్రోఎసోఫాగియల్ రిఫ్లక్స్ డిసీజ్
- సెలియాక్ వ్యాధి
- గ్యాస్ట్రోఎంటెరిటిస్
- బాక్టీరియా ఇన్ఫెక్షన్లు
- పిత్తాశయంలో రాళ్లు
- అపెండిసైటిస్
- ప్యాంక్రియాటైటిస్
- మూత్రపిండాల్లో రాళ్లు


అలాగే పెప్టిక్ అల్సర్లు, హెర్నియా, లాక్టోస్ అసహనం వంటి ఆహార అలర్జీలు కూడా కడుపు నొప్పికి కారణమవుతాయి. కొన్నిసార్లు ఆహారపు అలవాట్లు గతి తప్పడం, జీవనశైలి సరిగా లేకపోవడం, దీర్ఘకాలిక ఒత్తిడి, ఆందోళన వల్ల కూడా ఈ సమస్య తీవ్రతరం అవుతుంది. కడుపు నొప్పితో పాటు బరువు తగ్గడం, తీవ్రమైన బలహీనత వంటి లక్షణాలు ఉంటే తప్పకుండా జాగ్రత్తపడాలి.

### కడుపు నొప్పిని ఎలా నివారించాలి?

- సమతుల్యమైన ఆహారం సమయానికి తీసుకోవాలి.
- ఎక్కువగా కారంగా ఉన్న, వేయించిన ఆహార పదార్థాలను తగ్గించాలి.
- రోజూ తగినంత నీరు తాగాలి.
- రోజూ నడక లేదా తేలికపాటి వ్యాయామం చేయాలి.
- ఒత్తిడిని తగ్గించేందుకు యోగా, ధ్యానం అలవాటు చేసుకోవాలి.
- భోజనం చేసిన వెంటనే పడుకోకూడదు.
- రాత్రి భోజనం త్వరగా తినడం మంచిది.
- పరిశుభ్రత పాటించాలి.
- లాక్టోస్ అసహనం వంటి ఆహార సమస్యలు ఉంటే గుర్తించి ఆహారంలో మార్పులు చేయాలి.
- ఈ అలవాట్లు పాటిస్తే జీర్ణ సమస్యలు, తరచూ వచ్చే కడుపు నొప్పిని చాలా వరకు తగ్గించుకోవచ్చు.

### వైద్యుడిని ఎప్పుడు కలవాలి?

ఇంటి చిట్కాలతో తగ్గని కడుపు నొప్పి ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. తీవ్రమైన నొప్పి, వాంతులు, రక్తంతో కూడిన మలం, అకస్మాత్తుగా బరువు తగ్గడం, నిరంతర బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకూడదు. పిల్లలు, వృద్ధులు, గర్భిణిలలో కడుపు నొప్పిని అస్సలు నిర్లక్ష్యం చేయరాదు. దీర్ఘకాలంగా ఈ నొప్పి ఉంటే పరీక్షలు చేయించుకుని కారణాన్ని తెలుసుకుని సకాలంలో చికిత్స తీసుకోవడం చాలా అవసరం. ముందుగానే జాగ్రత్తపడితే తీవ్రమైన సమస్యలను నివారించవచ్చు.




డయాబెటిస్ వ్యాధి గ్రస్తులు ఆహార విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంతో పాటు శరీరానికి పోషకాలను, శక్తిని అందించే ఆహారాలను తీసుకోవాలి. డయాబెటిస్ వ్యాధిగ్రస్తులకు మేలు చేసే ఆహారాల్లో బాదంపప్పు కూడా ఒకటి. దీనిని తీసుకోవడం వల్ల చక్కెర స్థాయిల్లో వచ్చే హెచ్చుతగ్గులను తగ్గుతాయని వైద్యులు చెబుతున్నారు. బాదంపప్పు ఒక సూపర్ ఫుడ్ అని దీనిలో విటమిన్ ఇ, ప్రోటీన్, క్యాల్షియం, ఫైబర్ వంటి ఎన్నో పోషకాలు ఉంటాయని దీనిని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు. దాదాపు 2 ఔన్సుల బాదంపప్పును తీసుకోవడం వల్ల 45 పాయింట్ల గ్లూకోజ్ స్థాయిలు తగ్గుతాయని అలాగే ప్రీ డయాబెటిస్ ఉన్న వారు బాదంపప్పును తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుందని 2011 లో నిర్వహించిన ఓ అధ్యయనంలో వెల్లడైంది.



### మెగ్నీషియం లోపం..

అలాగే డయాబెటిస్ తో బాధపడే వారిలో మెగ్నీషియం లోపం ఎక్కువగా ఉంటుంది. డయాబెటిస్ తో బాధపడే వారిలో మూత్రం ద్వారా మెగ్నీషియం బయటకు వెళ్తుంది. దీంతో వారిలో మెగ్నీషియం లోపం తలెత్తుతుంది. కనుక డయాబెటిస్ తో బాధపడే వారు బాదంపప్పును తీసుకోవడం వల్ల మెగ్నీషియంతో పాటు ఇతర పోషకాలు కూడా లభిస్తాయి. ఇక డయాబెటిస్ తో బాధపడే వారిలో గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని హార్ట్ ఫెడరేషన్ సభ్యులు పేర్కొన్నారు. కనుక డయాబెటిస్ ఉన్నవారు బాదంపప్పును తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. బాదంపప్పులో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి గుండెకు ఎంతో మేలు చేస్తాయి. అయితే బాదంపప్పులో క్యాలరీలు అధికంగా ఉంటాయి. కనుక వీటిని మితంగా తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలగడంతో పాటు బరువు పెరగకుండా ఉంటారు, గుండె ఆరోగ్యంతో పాటు శరీర ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుంది.

### లేబుల్స్ పరిశీలించాలి..

బాదంపప్పుతోపాటు మనకు బాదం పాలు, బాదం వెన్న వంటి ఉత్పత్తులు కూడా లభిస్తూ ఉంటాయి. అయితే వీటిని తీసుకునే ముందు లేబుల్స్ ను పరిశీలించడం మంచిది. ఎందుకంటే వీటిలో చక్కెరలు, సోడియం వంటివి ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. ఇక ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఈ బాదంపప్పును తృణ ధాన్యాలు, ఓట్స్ లేదా స్మూతీలతో కలిపి తీసుకోవచ్చు. వీటిని నానబెట్టి నేరుగా తీసుకోవడంతో పాటు పండ్లతో కలిపి తీసుకోవచ్చు. డయాబెటిస్ తో బాధపడే వారు ఆహారంలో భాగంగా బాదంపప్పును తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని , రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.

## ఉదయం ఖాళీ కడుపుతో అరటి పండును తినవచ్చా..?

అత్యంత పోషకమైన, శక్తితో నిండిన ఆహారాల్లో అరటిపండు ఒకటి. అరటిపండు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. దీనిలో పొటాషియం, విటమిన్ బి6, మెగ్నీషియం వంటి ఎన్నో పోషకాలు ఉంటాయి. శక్తిని అందించడంలో, జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో, రక్తపోటును తగ్గించడంలో ఇలా అనేక రకాలుగా అరటిపండు మనకు సహాయపడుతుంది. ఉదయం పూట ఆహారంలో భాగంగా కొందరు పండ్లను తీసుకుంటూ ఉంటారు. అందులో భాగంగా ఉదయం గోళీ కడుపుతో అరటిపండును తీసుకోవచ్చా లేదా అన్న సందేహం కలుగుతూ ఉంటుంది. అసలు గోళీ కడుపుతో అరటిపండును తీసుకోవచ్చా లేదా, గోళీ కడుపుతో అరటిపండును తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, దుష్ప్రభావాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



### రక్త పోటు అదుపులో..

ఉదయం మేల్కొన్న తరువాత శరీరం రోజును ప్రారంభించడానికి సిద్దంగా ఉంటుంది. రోజును ప్రారంభించే ముందు ఉదయం పూట మనం తీసుకునే ఆహార విషయంలో జాగ్రత్తలు పాటించడం అవసరం. గోళీ కడుపుతో తీసుకునే ఆహారం మన శక్తి స్థాయిలను, మన శరీర జీవక్రియలను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. అలాగేరాత్రంతా ఉపవాసం ఉన్న తరువాత శరీరానికి శక్తిని అందించడానికి, హైడ్రేట్ చేయడానికి పోషకాలు చాలా అవసరం. కనుక ఉదయం మనం తీసుకునే ఆహారం ఆకలిని తీర్చడంతో పాటుగా జీవక్రియలను మెరుగుపరిచేదిగా, శక్తిని అందించేదిగా ఉండాలి. కనుక ఉదయం పూట అరటిపండ్లను తీసుకోవడం వల్ల ఆకలి తీరడంతో పాటు శరీరానికి కావల్సిన శక్తి, పోషకాలు అన్నీ అందుతాయి. గోళీ కడుపున అరటి పండ్లను తీసుకోవడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. రక్తపోటు స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. ఉదయం గోళీ కడుపుతో అరటిపండును తీసుకోవడం ప్రయోజనకరంగానే ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అయితే ప్రయోజనాలతో పాటు కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉంటాయని వారు తెలియజేస్తున్నారు.

### అందరికీ సరిపోదు..

గోళీ కడుపుతో అరటిపండును ఉదయం పూట తీసుకోవడం అందరికి సరిపోదని వారు సూచిస్తున్నారు. అరటిపండ్లను గోళీ కడుపుతో తీసుకోవడం వల్ల శరీరం ఇనుమును గ్రహించే సామర్థ్యం తగ్గుతుంది. దీంతో శరీరం మొత్తం శక్తి స్థాయిలు కూడా తగ్గుతాయి. రోగనిరోధక శక్తి కూడా తగ్గుతుంది. అలాగే అరటిపండులో క్యాలరీలు తక్కువగా ఉన్నప్పటికీ దీనిని తిన్న కొన్ని నిమిషాలకే ఆకలి పెరుగుతుంది. దీని వల్ల మనం అతిగా తినే అవకాశం కూడా ఉంది. తద్వారా శరీర బరువు కూడా పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా అరటిపండులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది కనుక ఇది కొందరిలో కడుపు నొప్పికి కారణమవుతుంది. ఫైబర్ సాధారణ మోతాదులో తీసుకోవడం వల్ల ప్రయోజనకరంగా ఉంటుంది. కానీ గోళీ కడుపుతో తీసుకునే ఫైబర్ కొందరిలో కడుపులో చికాకు, ఉబ్బరం గ్యాస్ వంటి సమస్యలను కూడా కలిగిస్తుంది. కనుక సున్నితమైన జీర్ణాశయం ఉన్న వారు గోళీ కడుపుతో అరటిపండును తీసుకోకపోవడమే మంచిది. ఈ విధంగా ఉదయం పూట గోళీ కడుపుతో అరటిపండును తీసుకోవడం వల్ల మనకు ప్రయోజనాలతో పాటు దుష్ప్రభావాలు కూడా ఉంటాయని గోళీ కడుపుతో అరటిపండును తీసుకోవాలా వద్దా అనే అంశాన్ని మన శరీరాన్ని బట్టి మనమే నిర్ణయించుకోవాలని వైద్యులు తెలియజేస్తున్నారు.

## ఈ ఆహారం తీసుకుంటే గుండె సమస్యలకు చెక్ పెట్టొచ్చు

మన ఆరోగ్యాన్ని రక్షించుకోవడానికి, ఫిట్ గా ఉండటానికి పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలతో కూడిన ఆహారం కచ్చితంగా తీసుకోవాల్సి ఉంటుంది. ఇవి మీ రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల గుండె సంబంధిత సమస్యలకు చెక్ పెట్టవచ్చు. గుండె జబ్బులను తగ్గించి, రక్త ప్రసరణ మెరుగుపరుచే కొన్ని ముఖ్యమైన ఆహార పదార్థాలు ఏంటో తెలుసుకుందాం.



### 1.ఆకు కూరలు, కూరగాయలు:

తోటకూర, పాలకూర వంటి ఆకుకూరల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వీటిలోని విటమిన్ ఖ రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. క్రూసిఫెరస్ కూరగాయలు అంటే బ్రోకలీ, కాలిఫ్లవర్ లలో యాంటీ ఆక్సిడెంట్స్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి.

### 2. తృణధాన్యాలు:

ఓట్స్, బ్రౌన్ రైస్, గోధుమలు, రాగులు వంటి తృణధాన్యాలలో పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి తోడ్పడుతుంది.

### 3. నట్స్, విత్తనాలు :

వాల్ నట్స్‌లో మెగ్నీషియం, కాపర్ ఉంటాయి. బాదం పప్పులో గుండెకు మేలు చేసే మోనో అన్‌శాచురేటెడ్ ఫ్యాట్ ఉంటాయి. అవిసె గింజలు(ఫ్లాక్స్ సీడ్) ల్లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. మీ ఆహారంలో గుమ్మడి గింజలు, పొద్దుతిరుగుడు గింజలు, పిస్తా వంటి వాటిని చేర్చుకోండి. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

### 4. వెల్లుల్లి, అల్లం:

వెల్లుల్లిలో ఉండే 'అల్లిసిన్' అనే సమ్మేళనం రక్తపోటును తగ్గించడానికి, రక్తనాళాల్లో పూడికలు ఏర్పడకుండా చూడటానికి సహాయపడుతుంది.

### 5. ఆలివ్ ఆయిల్:

ఆలివ్ ఆయిల్.. ఆలివ్ పండ్ల నుండి తీసే ఆరోగ్యకరమైన, పోషకాలతో కూడిన వంట నూనె. ఇందులో మోనోఅన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉండి, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి.

### 6. చేపలు :

సాల్మన్, మెకరెల్ చేపల్లో ఒమేగా- 3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ బి12, విటమిన్ డి, అయోడిన్, జింక్, సెలీనియం వంటి విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటును నియంత్రించడంలో, ట్రైగ్లిజరైడ్స్ తగ్గించడంలో సహాయపడతాయి. ఇవి గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

### 7. పండ్లు :

పండ్లలో ముఖ్యంగా స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలలో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. బ్లూబెర్రీస్ మెదడు, గుండె ఆరోగ్యానికి, వాస్కులర్ ఫంక్షన్‌కు మేలు చేస్తాయి. స్ట్రాబెర్రీలు విటమిన్ సి, కాల్షియం, పొటాషియంను అందించి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అవకాడో ఇది గుండెకు అవసరమైన ఆరోగ్యకరమైన కొవ్వులను అందిస్తాయి. నిమ్మ, నారింజ వంటి పండ్లలో విటమిన్ సి, ఫైబర్ ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

మంగళవారం 03-02-2026 SHENARTHI MEDIA

# నానికి జోడి గా బుట్టబొమ్మ?

తెలుగు సినీ పరిశ్రమలో మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌కు రంగం సిద్ధమవుతోంది. నేచురల్ స్టార్ నాని, 'సాహో' ఫేమ్ దర్శకుడు సుజీత్ కలిసి కొత్త సినిమా చేయనున్నారన్న వార్త అభిమానుల్లో భారీ ఉత్సాహాన్ని నింపుతోంది. ఇప్పటికే తన సహజ నటనతో పాటు ప్రయోగాత్మక సినిమాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాని , ఈసారి పూర్తిగా భిన్నమైన స్టైలిష్ యాక్షన్ అవతారంలో కనిపించనున్నారని సమాచారం. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది జూన్ నెల నుంచి ప్రారంభం కానుంది. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించబోతోందని తెలుస్తోంది. వీరిద్దరు ఫస్ట్ టైం జోడీ కడుతున్నారని, ఫ్రెష్ కాంబినేషన్ అని అభిమానులు అంటున్నారు. మేకర్స్ 2027లో ఈ సినిమాని థియేటర్లలో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు.





## అందాలతో కుర్రాళ్లను గిలిగింతలు పెడతున్న దివ్య

దివ్య భారతి తమిళ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంటోంది. 'బ్యాచిలర్' సినిమాతో వచ్చిన గుర్తింపు ఆమె కెరీర్‌కు బలమైన పునాది వేసింది. ఆ తర్వాత ఎంచుకుంటున్న పాత్రల్లో భావోద్వేగాల సహజత్వం, ఆత్మవిశ్వాసం స్పష్టంగా కనిపిస్తున్నాయి. తెరపై సున్నితత్వాన్ని, ధైర్యాన్ని సమతుల్యంగా చూపగలగడం ఆమెను కొత్త తరం నటీమణుల్లో ప్రత్యేకంగా నిలబెడుతోంది. ఇటీవల విడుదలైన ★'మదిల్ మేల్ కాదల్'లో ఆమె ప్రదర్శన ప్రశంసలు అందుకుంది. రొమాంటిక్ డ్రామాలో సహజమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. అలాగే 2024లో వచ్చిన ★'మహారాజా' లో భాగస్వామ్యమవడం ద్వారా కంటెంట్ ప్రాధాన్యమున్న సినిమాల్లోనూ తన సత్తా చాటింది. విభిన్న జానర్లలో కొత్త ప్రాజెక్టలతో ముందుకెళ్తున్న దివ్య భారతి, ఒక్కసారిగా స్టార్‌డమ్ కోసం కాకుండా.. దీర్ఘకాలిక కెరీర్ లక్ష్యంగా అడుగులు వేస్తోందన్న భావన కలుగుతోంది.

## 'దూకుడే కారణమంటూ వదిలేశాడు'

### తన బ్రేకప్ గురించి చెప్పిన మృణాల్ ఠాకూర్

నటి మృణాల్ ఠాకూర్ మరోసారి తన వ్యక్తిగత జీవిత వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. ప్రేమ, పెళ్లి అంశాలపై జరుగుతున్న చర్చల మధ్య తాజాగా ఆమె మాజీ ప్రేమికుడిపై చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. తనతో ఉండలేనంటూ అతడు బ్రేకప్ చెప్పినప్పుడు తానేమీ బాధపడలేదని మృణాల్ స్పష్టం చేశారు. 'దో దీవానే శహర్ మే' చిత్రం ఫిబ్రవరి 20న విడుదల కానున్న నేపథ్యంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాలను వెల్లడించారు. తనకు దూకుడు ఎక్కువని, నటిగా కొనసాగడమూ తన మాజీకి ఇష్టం లేదని చెప్పారు. అలాంటి మనస్తత్వం ఉన్న వ్యక్తితో జీవితం కొనసాగించడం కష్టమని, భవిష్యత్తులో పిల్లలపై కూడా దాని ప్రభావం పడుతుందని భావించి విడిపోయామని మృణాల్ తెలిపారు. ఇటీవల తన డేటింగ్‌పై వస్తున్న రూమర్స్‌పైనా ఆమె స్పందించారు. ధనుష్, శ్రేయస్ అయ్యర్‌లతో రిలేషన్‌లో ఉన్నట్టు వచ్చిన ప్రచారాలను ఖండిస్తూ, ఇవన్నీ ఊహాగానాలే అని, ఫ్రీ పీఆర్ స్టంట్స్‌లా నవ్వుతూ వదిలేస్తానని పేర్కొన్నారు.





# డిజిటల్‌లోనూ 'దురంధర్' దూకుడు..

## తెలుగులో అదిరిపోయిన స్పందన

కేవలం హిందీలో విడుదలై బాక్సాఫీస్‌ను షేక్ చేసిన 'దురంధర్' ఇప్పుడు డిజిటల్ వేదికపై కూడా సంచలనం సృష్టిస్తోంది. థియేటర్లలో వందల కోట్ల వసూళ్లు సాధించిన ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు వచ్చి అంచనాలకు మించి స్పందన తెచ్చుకుంటోంది. డిజిటల్ క్వాలిటీపై కొంత విమర్శలు ఉన్నా.. వ్యూస్ మాత్రం భారీగా నమోదవుతున్నాయి. హిందీతో పాటు ఇతర భాషల్లోనూ స్ట్రీమింగ్‌కు వచ్చిన ఈ చిత్రానికి తెలుగులో ప్రత్యేకమైన ఆదరణ లభిస్తోంది. ముఖ్యంగా తెలుగు డబ్బింగ్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఒరిజినల్ ఫీల్ తగ్గకుండా డైలాగులు రాయడం, పాత్రలకు సరిపోయే వాయిస్‌లు ఎంపిక చేయడం ప్రేక్షకులను ఆకట్టుకుంది. పాన్ ఇండియా సినిమా కాకపోయినా.. తెలుగులో ఇంత సహజంగా అనిపించడం అరుదని అభిమానులు అంటున్నారు. ఈ స్పందన దృష్ట్యా 'దురంధర్–2'కు తెలుగులో మరింత క్రేజ్ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి

## ఫిబ్రవరి 26నే ముహూర్తమా?

టాలీవుడ్‌లో ఎప్పటికప్పుడు చర్చలో ఉండే జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పెళ్లి వార్తలు మరోసారి సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. గత కొద్ది రోజులుగా ఫిబ్రవరి ప్రారంభంలోనే వివాహం జరుగుతుందన్న ప్రచారాన్ని రష్మిక ఖండించినా, కొత్త కథనాలు మాత్రం ఆగడం లేదు. తాజాగా వీరి పెళ్లి ఫిబ్రవరి 26న జరగవచ్చన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే రహస్యంగా నిశ్చితార్థం పూర్తయ్యిందన్న ఊహాగానాలు కూడా నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఇద్దరి చేతులపై కనిపించిన డైమండ్ రింగుల ఫొటోలు ఈ ప్రచారానికి మరింత ఊతమిచ్చాయి. ఇదిలా ఉండగా, రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో పెళ్లి ఏర్పాట్లు జరుగుతున్నాయన్న వీడియోలు సోషల్ మీడియాలో దర్శనమివ్వడంతో ఈ పుకార్లు మరింత బలపడుతున్నాయి. అయితే ఈ అంశంపై విజయ్ గానీ, రష్మిక గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. వివాహ వార్తలు ఎంత హోరెత్తినా, నిజానిజాలు తెలియాలంటే ఈ జంట నుంచి స్పష్టత రావాల్సిందేనని అభిమానులు భావిస్తున్నారు. అప్పటివరకు ఈ పెళ్లి గాసిప్‌లకు ఫుల్‌స్టాప్ పడేలా లేదు.



Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644